మాస్టర్ ప్లాన్.. అమలుకు ఎన్నేళ్లు?

- 20 ఏళ్ల క్రితం రూపొందించిన అమలాపురం మాస్టర్ ప్లాన్
- డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు మరో 18 ఏళ్ల సమయం
- అమలు చేసేదెప్పుడని ప్రశ్నిస్తున్న పట్టణ ప్రజలు



అమలాపురం పట్టణం



అమలాపురం మాస్టర్ ప్లాన్ మ్యాప్

అమలాపురం టౌన్: నిర్దేశిత భౌగోళిక ప్రాంతంలో రానున్న 20 ఏళ్లలో పట్టణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చట్టబద్ధమైన ప్రణాళిక పత్రమే మాస్టర్ ప్లాన్. అమలాపురం పట్టణానికి 2004 అక్టోబర్ 30వ తేదీన మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. అయితే దానికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వచ్చేందుకు మరో 18 ఏళ్లు పట్టింది. 2022 జూన్ 20న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వచ్చింది. అయినా మాస్టర్ ప్లాన్‌కు పచ్చజెండా ఊపకపోవడంతో అమలుకు ఇంకెన్నేళ్లు పడుతుందని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పడుతున్న అడుగులు

మాస్టర్ ప్లాన్‌ను పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు మరోసారి సమీక్షించి త్వరలోనే అమలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, కౌన్సిలర్లు ప్లాన్‌పై ఇచ్చిన సూచనలు, సలహాలతో మార్పులు, చేర్పులు చేసి ముందుకెళ్లే యోచనలో ఉన్నట్లుగా తెలుస్తుంది. రెండేళ్ల క్రితం అమల్లోకి వచ్చిన అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అముడా) పర్యవేక్షణలోనే అమలు జరుగుతున్నా అందుకు అవసరమైన సాంకేతిక సహకారం మాత్రం పట్టణ ప్రణాళిక విభాగమే అందిస్తోంది. అమలాపురం జిల్లా కేంద్రం కావడంతో వేగంగా పడుతున్న అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ మరింత ఊతమిస్తుందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ప్లాన్ అమలైతే అభివృద్ధి

మాస్టర్ ప్లాన్ అమలైతే పట్టణం స్వరూపమే మారిపోతుంది. ముఖ్యంగా ఇప్పుడున్న 25 నుంచి 40 అడుగుల వెడల్పుతో ఉన్న ప్రధాన రోడ్లు 40 అడుగులు, 60 అడుగులు, 80 అడుగుల వెడల్పుతో విశాలమైన రోడ్లు సాకారం కానున్నాయి. ప్లాన్ ప్రకారం దాదాపు 30 రోడ్ల వరకూ విస్తరణకు నోచుకోనున్నాయి. పట్టణం చుట్టూ ఓ రింగ్ రోడ్డు కూడా ప్రతిపాదనలో ఉంది. ముఖ్యంగా బైపాస్‌ల సంఖ్య ఇప్పటికే పెరిగిన నేపథ్యంలో వాటికి కనెక్టింగ్ రోడ్ల నిర్మాణం కూడా జరగనుంది. పట్టణం 7.02 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నా అందులో దాదాపు 40 నుంచి 50 ఎకరాలు వ్యవసాయ భూములుగానే ఉన్నాయి. ఈ భూముల్లో రియల్ ఎస్టేట్ రంగం విస్తరిస్తున్న వేళ ప్రభుత్వానికి కన్వర్షన్ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. ఇప్పుడు ఆ సమస్య లేకుండా పట్టణం మొత్తం కమర్షియల్ ఏరియాగా ప్లాన్‌లో నిర్ధారించారు. వీటన్నింటికీ మించి పట్టణం ఓ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయనున్నారు. ఉదాహరణకు ట్రాఫిక్ పరంగా మోటారు సైకిళ్లు, కార్లు, ఆటోలు ఇలా పలు వాహనాలు పార్కు చేసుకునేందుకు స్థలాల సూచిక సైతం ఉంటుంది.

3 నెలల్లో అమల్లోకి వచ్చే అవకాశం

పట్టణానికి మాస్టర్ ప్లాన్ రానున్న మూడు నెలల్లో అమలయ్యే అవకాశం ఉంది. అముడా పరిశీలనతో పాటు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగానికి, ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చే ప్రక్రియ జరుగుతోంది. ఈ మూడు దశల్లో పరిశీలన పూర్తయితే మాస్టర్ ప్లాన్ అమలవుతోంది. మాస్టర్ ప్లాన్‌తో పట్టణానికి విశాలమైన సౌకర్యాలతో కూడిన అభివృద్ధి సాధ్యమవుతుంది.

– ఎస్.మనోహర్, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

వర్గీకరణపై సుప్రీం తీర్పును అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్ : సుదీర్ఘ పోరాటం తరువాత మన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల వర్గీకరణ జరుపుకోవచ్చని తీర్పు ఇవ్వడంపై ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హర్షం వ్యక్తం చేశారు. మండలంలో కామనగరువులో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మడికి శ్రీరాములు అధ్యక్షతన గురువారం విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తక్షణమే అమలు చేయాలని కోరారు. అంతవరకు ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్లు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 30 సంవత్సరాలు సుదీర్ఘ ఉద్యమం నడిపిన మందకృష్ణ మాదిగకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, తొత్తరమూడి మహేశ్వరరావు, చేట్ల విద్యాసాగర్, ఆకుమర్తి సత్యనారాయణ, నవరపు నాని బాబు, నేదునూరి ప్రశాంత్, ఉందుర్తి సతీష్, నవరపు ప్రసాద్, చేట్ల రవి కిరణ్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం



నడిపూడిలో హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ నాగేశ్వరరావు తదితరులు

అమలాపురం రూరల్: రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం శుభ పరిణామమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం నడిపూడిలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ కల్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకరరావు, మందా వెంకటేశ్వరరావు, నూటికుర్తిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తీర్పు వెనక్కి తీసుకోవాలి



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న జిల్లా దళిత ఐక్యవేదిక ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం రూరల్: దళితులను వర్గీకరణ పేరుతో విడగొట్టేందుకు వీలుగా తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని వెనక్కి తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐక్యవేదిక ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈదరపల్లి దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబురావు నివాసం వద్ద గురువారం రాత్రి దళిత ప్రజా సంఘాల నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబురావు, కార్యదర్శి ఇసుక పట్ల రఘుబాబు పాల్గొన్నారు.

ఏసీ మాచిరాజుకు వేదాశ్వీరచనం

ఐ.పోలవరం: దేవాదాయ శాఖ జిల్లా నూతన సహాయ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన మురమళ్ల వీరేశ్వర స్వామివారి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణకు ఆలయ అర్చక, పురోహిత వేదపండితులు గురువారం వేదాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు, అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు, బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్, వేదపండితులు గంటి సుబ్రహ్మణ్యం, నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్



అమలాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ స్థానిక 3వ వార్డులోని బ్రహ్మానందం వీధిలో సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు గురువారం ఉదయం పంపిణీ చేశారు. దివ్యాంగ, వృద్ధాప్య, వితంతువు పింఛన్లకు సంబంధించి ముగ్గురు లబ్ధిదారులకు కలెక్టర్ పింఛన్ల సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, వార్డు కౌన్సిలర్ ఏడిద శ్రీను, త్సవటపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పింఛన్లు పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా 7,967 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించాల్సి ఉండగా 96 శాతం మంజూరు చేశామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు.

కాట్రేనికోన: మండలంలో నడవపల్లి, చెయ్యేరుల్లో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన నడవపల్లి వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు.

డిమాండ్ల సాధనకు మున్సిపల్ ఉద్యోగుల నిరసన



యానాంలో నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

యానాం: పుదుచ్చేరి రాష్ట్ర మున్సిపాలిటీ, కమ్యూన్ పంచాయతీ ఉద్యోగుల రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు గురువారం యానాం మున్సిపల్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఒకరోజు నిరసన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ జీతాలు ట్రెజరీ ద్వారా చెల్లించాలని, అదేవిధంగా ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్లు, రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేయాలని, కారుణ్య నియామకాలు జరపాలని, ఉద్యోగులకు బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 6వ తేదీ నుంచి నిరసన మళ్లీ ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.కృష్ణ, ఉపాధ్యక్షుడు కర్రి రాంబాబు, ట్రెజరర్ చెల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

కారులో వచ్చారు.. సామగ్రితో ఉడాయించారు

తాళ్లరేవు: మండలంలోని కోరంగి పంచాయతీ సీతారామపురంలో గురువారం ఓ విచిత్రమైన దొంగతనం చోటుచేసుకుంది. స్థానిక మరిడమ్మ ఆలయం చెంతనే ఉన్న నందిత ఎంటర్‌ప్రైజెస్ దుకాణానికి ఒక కారులో కొంతమంది వ్యక్తులు వచ్చారు. సుమారు రూ.10,000 విలువైన ఐదు బియ్యం బస్తాలు, ఐదు మంచినూనె టిన్నులు కొనుగోలు చేసి కారు డిక్కీలో వేసుకున్నారు. సొమ్ము ఫోన్‌పే చేశాం చూసుకోమంటూ షాపు యజమానికి చెప్పారు. యజమాని ఫోన్ లాక్ ఓపెన్ చేసి డబ్బులు జమయ్యాయో లేదో చూసుకునేలోపే అక్కడి నుంచి ఉడాయించారు. తనకు డబ్బుకు రాలేదని తెలుసుకున్న షాపు యజమాని ఓలేటి ఈశ్వరి జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదుచేశారు. కోరంగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను చెక్ చేసి వాటి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల భవనం పరిశీలన



ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు శివారు శ్రీరంగనాయకపురం గ్రామంలో శిథిల స్థితికి చేరుకుని పెచ్చులూడుతున్న పాఠశాల భవనాన్ని ఎంపీపీ రాయుడు సునీత గురువారం పరిశీలించారు. భవనం పెచ్చులూడుతూ విద్యార్థులు గాయాల పాలవుతున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఎంపీపీ మండల విద్యాశాఖాధికారి మోకా ఉమతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పరిస్థితిని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దృష్టికి తీసుకెళ్లి భవనాన్ని పునర్నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎంపీపీ వెంట రాయుడు గంగాధర్, వెదులుపావులూరి నాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చికెన్ బిర్యానీ

అమలాపురం టౌన్: స్థానిక అశోక్‌నగర్‌లోని శ్రీలక్ష్మి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు జంగా అబ్బాయి వెంకన్న, కనకదుర్గ దంపతుల కుమారుడు చరణ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం మధ్యాహ్నం చికెన్ బిర్యానీ, స్వీటు తదితర ఆహార పదార్థాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యా శాఖ రిసోర్స్ పర్సన్ మెండి శ్రీనుబాబు, ఉపాధ్యాయుడు జె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ.పోలవరం: వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఏఈ మోకా రవికుమార్ గురువారం తెలిపారు. గుత్తెనదీవి సబ్‌స్టేషన్ పరిధిలో గుత్తెనదీవి, జి.వేమవరం, గోగుల్లంక, మగసానితిప్ప, పాత ఇంజరం గ్రామాల్లో, ఐ.పోలవరం సబ్‌స్టేషన్ పరిధిలో కేశనకుర్రు, కేశనకుర్రుపాలెం, తిల్ల కుప్ప గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

గోడిలంక ఫీడర్‌లో..

అల్లవరం: అల్లవరం, గోడిలంక ఫీడర్ పరిధిలో వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం గోడితిప్ప, గోడి, గోడిలంక, తూర్పులంక, రెల్లుగడ్డ, అల్లవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు ఈఈ రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.



రక్షణ గోడలు కూలి ప్రమాదకరంగా మారిన సమనస వంతెన

ప్రమాదకరంగా వంతెన

అమలాపురం రూరల్: మండలంలోని సమనస లాకుల వద్ద పంట కాలువపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు విరిగి ప్రమాదకరంగా మారింది. అమలాపురం, చల్లపల్లి ప్రధాన రహదారి నుంచి ఈ లాకుల మీదుగానే పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. నిత్యం స్కూల్ బస్సులు, చిన్నారులను తీసుకెళ్లే ఆటోలు సైతం ఇటుగా వెళుతుంటాయి. అయితే వంతెన రక్షణ గోడలు కూలిపోవడంతో ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు రక్షణ గోడ పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తాండవపల్లిలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

వేలాడుతున్న విద్యుత్ వైర్లు

అమలాపురం రూరల్: మండలంలోని తాండవపల్లి గ్రామంలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. దీంతో ప్రజలు భయంతో బెంబేలెత్తుతున్నారు. విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వైర్లు సరిచేయాలంటూ ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళ చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

డ్వాక్రా యానిమేటర్ అదృశ్యం

అమలాపురం రూరల్: మండలంలోని గున్నేపల్లి అగ్రహారానికి చెందిన డ్వాక్రా యానిమేటర్ యార్లగడ్డ సుశీల తన భర్త దుర్గారావుతో కలిసి గురువారం అదృశ్యమైంది. తమకోసం వెతకొద్దని, తమ పిల్లలను బాగా చూసుకోవాలని, తాము ఆత్మహత్య చేసుకోవడానికి వెళుతున్నట్లు సుశీల ఓ లేఖ విడుదల చేసినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఆమె డ్వాక్రా మహిళా సంఘాల స్త్రీనిధి రుణాలకు సంబంధించి రూ.2 లక్షల వరకూ నగదును పక్కదారి పట్టించడంతో పాటు అప్పుల్లో కూరుకుపోయినట్లు తెలుస్తోంది. సుశీల అదృశ్యం కావడంతో డ్వాక్రా సంఘాల మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఏపీఎం పీవీవీ రమణను వివరణ కోరగా సుశీల అదృశ్యమైన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. స్త్రీనిధి రుణాలు పక్కదారి పట్టిన విషయంపై విచారణ చేస్తామన్నారు.

జేసీని కలిసిన ఖాదర్



జాయింట్ కలెక్టర్ నిషాంతిని మర్యాదపూర్వకంగా కలిసిన ఖాదర్

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్(జేసీ)గా బాధ్యతలు స్వీకరించిన టి.నిషాంతిని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లో జేసీని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏసీ నాగమల్లేశ్వరరావు సేవలు అభినందనీయం



నాగమల్లేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న డీసీ విజయరాజు తదితరులు

అమలాపురం టౌన్: జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన డి.నాగమల్లేశ్వరరావు సేవలు అభినందనీయమని డిప్యూటీ కమిషనర్(డీసీ) విజయరాజు అన్నారు. స్థానిక వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి ఏసీ నాగ మల్లేశ్వరరావుకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నూతన అసిస్టెంట్ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ, జిల్లా దేవాదాయ శాఖ ఈవోల అసోసియేషన్ అధ్యక్షుడు బొక్కా వీర వెంకటేశ్వరరావు, ఈవోలు కోనేటి కార్తీక, సానబోయిన సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ మల్లికార్జునరావును సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉప్పలగుప్తం: స్థానిక మండల తహసీల్దార్‌గా సేవలందించి బదిలీపై వెళుతున్న టి.మల్లికార్జునరావును రెవెన్యూ సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. మల్లికార్జునరావు ఎన్నిక బదిలీల్లో భాగంగా మచిలీపట్నం నుంచి ఉప్పలగుప్తం మండలానికి వచ్చారు. తాజాగా ఆయనకు మళ్లీ బదిలీ కావడంతో డిప్యూటీ తహసీల్దార్ వి.దివాకర్ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ వైవీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ ఎం.వెంకటరమణ, వీఆర్‌వోల సంఘ మండల అధ్యక్షుడు అహ్మద్ అలీషా, సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మురళీకృష్ణ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక పెంకెవారిపేట గ్రామానికి చెందిన చిక్కం మురళీకృష్ణ గత నెలలో విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మురళీకృష్ణ కుటుంబసభ్యులను తాళ్లరేవు తాపీమేస్త్రి సంఘం సభ్యులు గురువారం పరామర్శించి రూ.7,500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్, ప్రతినిధులు పోతుల రాజు, కె.ఈశ్వరరావు, మేడిశెట్టి సత్తిబాబు, అత్తిలి గణేష్, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

8న నవోదయలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

సాక్షి ఇంపాక్ట్

యానాం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఉపాధ్యాయుల కొరతపై ఈ నెల 1వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. నవోదయలో ఖాళీగా ఉన్న వివిధ టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకానికి ఈ నెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సి.రాజశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ–ఐటీ, పీజీటీ–హిస్టరీ, పీజీటీ–ఇంగ్లిష్, టీజీటీ–ఇంగ్లిష్, టీజీటీ–సైన్స్ పోస్టులకు స్థానిక యానాం మెట్టకూరు నవోదయ విద్యాలయలో 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరుకావాలన్నారు. అభ్యర్థుల వయసు 50 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఎంపికైన పీజీటీలకు నెలకు రూ.35,750, టీజీటీలకు రూ.34,125 ఇస్తారన్నారు.

పీహెచ్‌డీ పట్టా పొందిన అధ్యాపకురాలికి సత్కారం



అధ్యాపకురాలు మౌనికను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ కోటి లింగం తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జంతు శాస్త్రం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న జీడిగుంట మౌనిక ఇటీవల పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కవల కోటిలింగం అధ్యక్షతన కళాశాలలో గురువారం జరిగిన సభలో అధ్యాపకురాలు మౌనికను ఘనంగా సత్కరించారు. మౌనిక అధ్యాపకురాలిగా పనిచేస్తూనే కార్యదీక్షతో పీహెచ్‌డీ పట్టా సాధించారని ప్రిన్సిపాల్ కోటిలింగం ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.శిరీష, ఎం.శ్రీనివాసరావు, న్యాయవాది ములపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

తాళ్లరేవు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ మాధవి ప్రారంభించారు. స్థానిక సామాజిక ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నిభావని, సత్యనళిని తల్లిపాల ప్రాముఖ్యతను మహిళలకు వివరించారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమన్నారు. తల్లిపాల ద్వారానే పిల్లలకు పౌష్టికాహారం సమృద్ధిగా అందడంతో పాటు తొలి టీకాగా పనిచేస్తాయని చెప్పారు.

నేటి నుంచి జోనల్ స్కూల్ గేమ్స్

యానాం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ జోనల్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2, 3 తేదీల్లో అండర్–14, 17 బాలికలు, అండర్–17 బాలురు, అండర్–19 బాలికల చెస్ పోటీలు జరుగుతాయన్నారు. అదేవిధంగా 5, 6 తేదీల్లో అండర్–17 బాలుర వాలీబాల్ పోటీలు జరుగుతాయని, 7న అండర్–19 వాలీబాల్, ఫుట్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ సైతం నిర్వహిస్తామన్నారు.

చర్చి ఆవరణలో విగ్రహాల ఆవిష్కరణ

యానాం: పట్టణంలో చారిత్రక ఫ్రెంచి కాలం నాటి రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో పారంపర్యము పేరుతో నూతనంగా నిర్మించిన గురునిలయం, స్వరూపాలు, శిలువ స్వరూపం, వ్యాకుల మాత మండపాల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు, విశాఖ మేత్రానుల పాలనాధికారి పొలిమేర జయరావు, ఆర్ఏఓ మునిస్వామి, స్థానిక పాదర్ మరిదాసు ఆధ్వర్యంలో విశేష ప్రార్థనలు నిర్వహించారు.